


ఎపి సీడ్స్‌కు నిధులు విడుదల

ప్రజాశక్తి - సాలూరు

ఎపి సీడ్స్ సంస్థకు విత్తన ధాన్యం విక్రయించిన రైతులకు సంబంధించిన నిధులు విడుదల చేస్తూ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్థానిక ఎపి సీడ్స్ కార్యాలయానికి ఉత్తర్వులు చేరినట్లు అధికారులు తెలిపారు. సుమారు 3వేల మంది రైతులకు అడ్వాన్స్ చెల్లింపుల రూపంలో పంపిణీ చేయాల్సిన మొత్తం రూ.5.3 కోట్లు విడుదలయ్యాయి. రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమచేయనున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌కు విత్తన ధాన్యం ఉత్పత్తి చేసిన రైతులకు అనివార్యం కారణాల రీత్యా బిల్లులు సకాలంలో మంజూరు కాలేదు. దీంతో రైతులు కొద్దిరోజుల క్రితం డిప్యూటీ సీఎం రాజన్నదొరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన రాజన్నదొర వెంటనే సిఎంకు లేఖ రాశారు. ఈమేరకు ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీలో రహదారు(ణా)లు

అర్ధాంతరంగా వదిలేసిన రోడ్లు ● అవస్థలు పడుతున్న గిరిజనులు

ఎన్ని ప్రభుత్వాలు మారినా గిరిజనుల బతుకులు మాత్రం మారలేదు. కంప్యూటర్ యుగంలో చంద్రం మండలంపై అడుగుపెట్టి ఇల్లు నిర్మించుకోవడానికి ఒకవైపున సన్నాహాలు చేస్తుంటే నేటికీ సీతంపేట ఏజెన్సీలో గిరిజన గ్రామాల్లో రహదారులు లేక ఆదివాసులు నానా అవస్థలు పడుతున్నారు. రాళ్లు తేలిన రహదారిపై నడవలేక అత్యవసర ప్రయాణాలు ఆపుకోలేక నానాతంటాలు పడుతున్నారు. ప్రతి గ్రామానికి రహదారి ఉంటేనే ఆ గ్రామం అన్నింటా అందుబాటులోకి వచ్చి అభివృద్ధి చెందుతుంది. అయితే గిరిజన గ్రామాలకు నేటికీ రహదారి లేకపోవడంతో అత్యవసర సమయంలో అంబులెన్స్, 108, అగ్నిమాపక శకటం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అంతేకాక మరికొన్ని గ్రామాల్లో పిడిఎస్ బియ్యం వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. ఎత్తయిన కొండల శిఖరాలపైన ఉన్న గ్రామాలకు రహదారులు లేకపోవడం, ప్రారంభించిన రోడ్లు పనులు అర్ధాంతంగా నిలిచిపోవడంతో ఇప్పటికీ 108 వాహనం వెళ్లలేని పరిస్థితి ఉంది. దీంతో గర్భిణులను, రోగులను డోలి లోనే తేవాల్సి పరిస్థితి వస్తుంది.



డుమ్మంగివలసకు వెళ్లే రాళ్లు తేలిన రహదారులు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 20 మండలాలు ఉన్నాయి. 40 రహదారులు ప్రారంభం కాలేదని అధికారులు గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఇంతకంటే ఎక్కువ ఉండవచ్చని ప్రజలు చెబుతున్నారు. సీతంపేట మండలంలోని దాసు గుమ్మడ, కె.వీరఘట్టానికి రహదారి లేక గిరిజనులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కిల్లాడ నుండి దోనుబాయి, పల్లంకి నుండి గెద్దకోలా, బర్ణ సీతంపేట, మర్రిపాడు నుండి పూతికవలస రహదారి గోతులు మయంగా మారింది. కొత్తూరు నుంచి మర్రిపాడు వరకు రహదారి వేసినప్పటికీ మర్రిపాడు నుంచి పూతికవలస వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారి వేయలేదు. బంజారాగూడ నుంచి గూడంగికి రహదారి వేయాల్సి ఉంది. తుంబలిగూడ, కన్నయ్య గూడ, కొత్తగూడ, ఎగువ డుంబంగివలసకు రహదారి వేయాలి. మర్రిపాడు నుండి ఎగువ ద్వారబందం మూడు కిలోమీటర్ల రహదారి వేయాల్సి ఉంది. గుత్తేదారులు రెండు కిలోమీటర్ల రహదారి మాత్రమే వేశారు. రంగం వలస సిసి రోడ్డు వేయాల్సి ఉండగా, తెవ్వేసి వదిలేయడంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నబగ్గ నుంచి సుంకిలి వరకు రహదారి తవ్వి వదిలేశారు.

అలాగే భామిని మండలంలో మణిగ నుంచి కోతకొండ, లివిరి నుంచి నడిమిగూడ తదితర రహదారులు వేయాల్సి ఉంది. దీనిపై ఇప్పటికే స్పందన కార్యక్రమంలో వినతులు సమర్పించినప్పటికీ ప్రయోజనం లేదని గిరిజనులు వాపోతున్నారు.

50 శాతం రహదారులు ప్రగతిలో ఉన్నాయి

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 82 రహదారులకు అందులో 50శాతం రహదారులు ప్రగతి ఉన్నాయి. మిగతా రహదారులు త్వరలోనే పూర్తి చేస్తాం. కొన్ని ఆలస్యంగా మంజూరయ్యాయి. గుత్తేదార్లు బడ్జెట్ ఉన్నంతవరకే రహదారులు వేశారు.

ఎస్ సింహాచలం,
ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఐటిడిఎ, సీతంపేట.

రహదారులు వేయాలి

గిరిజన గ్రామాల్లో రహదారులు వేస్తేనే ఆ గ్రామాలకు అన్ని వస్తువులు వస్తాయి. మర్రిపాడు నుంచి పూతికవలస వరకు రహదారి గోతులమయం రాళ్లు తేలడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే రోడ్డు లేని గ్రామాలకు రోడ్డులు వేయాలి.

మండంగి వెంకటేష్,
గిరిజనుడు, డుంబంగివలస

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో గల వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. బుధవారం ఐటిడిఎ పరిధిలో గల అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఎం, వార్డెన్ నిరంతరం వసతిగృహాల్లో ఉండి, పర్యవేక్షించాలన్నారు. వైద్యాధికారులు ప్రతినెలా సంబంధిత పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. సికిల్‌సెల్ ఎనేమియా వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని పాఠశాలల్లో సికిల్‌సెల్ వైద్య పరీక్షలు చేయాలన్నారు. హెచ్‌ఎంలు, మెడికల్ ఆఫీసర్లు సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. పాఠశాలల్లోకి ఇతర వ్యక్తులను అనుమతించకూడదని సూచించారు. పాఠశాలల్లో పోషకాహార విలువలతో కూడిన ఆహారాన్ని పెట్టాలని అన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, ఎటిడబ్ల్యుఒలు మంగవేణి, శ్రీనివాసరావు, వైద్యాధికారులు సాయిచరణ్, రవీంద్ర, భాను ప్రతాప్, పిఎంఆర్‌సి సిబ్బంది, ఎఎంఒ కోటిబాబు, జిసిటి ఒ.రాములమ్మ, హెచ్‌ఎంలు, హెచ్ డబ్ల్యువోలు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

నామినేషన్ల చివరి రోజుకు ఫారం-బి సమర్పించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

నామినేషన్ల చివరి రోజు నాటికి ఫారం-బి సమర్పించాలనికలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. రాజకీయ పార్టీలతో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల సంబంధిత అంశాల పట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఫారం-బిను నామినేషన్లతో సమర్పించాలన్నారు. నామినేషన్లతో సమర్పించలేని పక్షంలో నామినేషన్ల చివరి రోజు 3 గంటల్లోగా అధీకృత సంతకం కలిగిన ఫారాలు సమర్పించాలన్నారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అదనంగా సహాయక కేంద్రం ఏర్పాటు, పోలింగ్ కేంద్రం పేరు మార్పు, లొకేషన్ మార్పుపై ప్రధాన ఎన్నికల అధికారి ప్రతిపాదనలు కోరారని తెలిపారు. జిల్లాలో 243 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పునకు, 26 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పునకు ప్రతిపాదనలు సమర్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో పాలకొండ నియోజక వర్గంలో 120 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పునకు, 12 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పునకు, కురుపాంలో 5 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పునకు, 8 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పునకు, పార్వతీపురంలో 85 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పునకు, 2 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పునకు, సాలూరులో 33 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పునకు, 4 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పునకు ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. తుది ఓటరు జాబితా ప్రకటన అనంతరం అందిన ఫిర్యాదులు, మీడియా నివేదికల ఆధారంగా విచారణ జరిపి 1032 ఓట్లను తొలగించడం జరిగిందని తెలిపారు. 80 ఏళ్ల వయస్సు పైబడి కదల లేని స్థితిలో ఉన్న ఓటర్లు ముందుగా దరఖాస్తు చేసుకుంటే వాటికి పోస్టల్ బ్యాలెట్ మంజూరు చేయడం జరుగుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ వివరించారు. సమావేశంలో ఇన్ ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవ నాయుడు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎ శ్రీనివాస రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులైన రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రైతు భరోసా నిధులు విడుదల

సున్నా వడ్డీ కింద 27,905 మంది రైతులకు రూ.5.23 కోట్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

రైతు భరోసా - పిఎం కిసాన్ పథకం కింద 2023-24 సంవత్సరానికి జిల్లాలో 1,46,016 మంది రైతులకు రూ.29 కోట్ల 32 లక్షలు రైతు ఖాతాల్లో జమైంది. రైతు భరోసా - పి.ఎం.కిసాన్ ఐదేళ్లలో రెండో విడత నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి బుధవారం రైతుల ఖాతాలలోకి నేరుగా జమచేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి రైతు భరోసా - పిఎం కిసాన్ పథకం నిధుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 1,46,016 మంది రైతు కుటుంబాలకు రూ.29.32 కోట్లు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం రైతులకు కావాల్సిన అన్ని సేవలను రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నదని, రైతు వేసిన పంటలకు సంబంధించి సేవలు పొందేందుకు పంటలు పండించే రైతులంతా ఇ-క్రాప్ బుకింగు చేయించుకోవాలని తెలిపారు. సున్నా వడ్డీ కింద 27,905 మంది రైతులకు 2021 - 22 రబీ సీజన్, 2022 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రూ.5.23 కోట్లు జమ చేశారు. లబ్ధిదారులు నగదు జమ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఏటా అన్న మాట ప్రకారం జమ చేసి రైతులను ఆదుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె రాబర్ట్ పాల్ , లబ్ధిదారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంఎస్‌ఎంఇ సంస్థల సర్వే

ప్రజాశక్తి -పార్వతీపురం

మధ్యతరహా, చిన్న, సూక్ష్మ పరిశ్రమలు (ఎం ఎస్ ఎం ఇ) సర్వేను మార్చి 1 నుంచి నిర్వహించనున్నట్టు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఎస్‌ఎంఇల పని తీరును మెరుగుపర్చడం, అభివృద్ధిని వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వ ర్యాంప్ పథకం కింద సర్వే జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఫిబ్రవరి 14న ప్రారంభించినట్టు తెలిపారు. ఎంఎస్‌ఎంఇల సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని సంస్థలను డిజిటల్ ప్లాట్ ఫామ్‌లోకి తీసుకొచ్చి ఎపిఎంఎస్‌ఎంఇ వన్ పోర్టల్‌కు అనుసంధానించడం జరుగుతుందన్నారు. నమోదు కాని వ్యాపారాలను ఉద్యం, ఉద్యమ అసిస్ట్‌లో నమోదు చేయడం ఎంఎస్‌ఎంఇ - ఫార్మలైజేషన్ ముఖ్య ఉద్దేశం అన్నారు. పరిశ్రమల శాఖ ఎపి ఎంఎస్‌ఎంఇ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో సర్వే నిర్వహిస్తుందని పేర్కొన్నారు. సర్వే కోసం ఎంఎస్‌ఎంఇ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ ఆప్ ను రూపొందించడం జరిగిందని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డ్ అమెనిటీ సెక్రటరీలు ఈ సర్వేను మార్చి 1 నుండి 20 వరకు చేపడతారని కలెక్టర్ చెప్పారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం పర్యవేక్షిస్తుందన్నారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని అన్ని ఎంఎస్‌ఎంఇల డేటా బేస్‌ను అభివృద్ధి చేస్తామని, వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించడం, మహిళలు, ఎస్టీ, ఎస్సీ పారిశ్రామికవేత్తల నైపుణ్యాలను అభివృద్ధి పర్చడం మొదలైన సేవలను కల్పిస్తామన్నారు. అలాగే సర్వేలో గుర్తించిన నమోదు కాని ఎంఎస్‌ఎంఇలకు అవగాహన శిబిరాలను నిర్వహించి ఉద్యం లేదా ఉద్యం అసిస్ట్ ద్వారా నమోదు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. తద్వారా వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందేందుకు అర్హులు అవుతారని, బ్యాంకు రుణ సదుపాయాలు సులభతరం అవుతాయని, ఎం ఎస్ ఎం ఇ లలో జరిగే చెల్లింపుల జాప్యాన్ని నివారించేందుకు సమాధాన పోర్టల్‌తో అనుసంధానించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఎంఎస్‌ఎంఇ అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్లు, వర్తక, వాణిజ్య సంఘాలు సర్వే టీమ్ కు సహకరించి సర్వేకు అవసరమైన వివరాలు అందించి సర్వేను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

త్వరలో జరగబోవు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జనవరి మాసాంతపు నేర సమీక్షా సమావేశం నిర్వహించి, పెండింగ్‌లో వివిధ రకాల కేసులను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్థుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డ్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేదింపునకు మరియు పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మరియు మెళకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. అనంతరం రాబోవు ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, అందరం ఇప్పటి నుంచే సిద్దంగా ఉండాలని సూచించారు. ముందుగానే సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ ప్రాంతాలను సెక్టార్ల ప్రకారం విభజించి ప్రత్యేక అధికారులను నియమించి, అక్కడ అనుసరించాల్సిన కార్యాచరణ గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గల పోలింగ్ కేంద్రాలను అధికారులు సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించాలని, గతంలో ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాలు, అతి సమస్యాత్మక గ్రామాల్లో గతంలో జరిగిన కేసుల్లో ఎవరెవరు ముద్దాయిలుగా ఉన్నారు వారిపై తీసుకున్నంటున్న చర్యలను గుర్తించి ముందుగా సమాచారాన్ని సేకరించాలని ప్రతి ఒక్కరిపై నిఘా ఉంచాలని తెలిపారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికలకు సమాయత్తమయ్యే సందర్భంలో మద్యం, డబ్బు, మాదకద్రవ్యాలు రవాణా జరిగే ప్రదేశాలను ముందుగా గుర్తించి ఒక మ్యాపింగ్ తయారు చేయాలని, ఇఎస్ఎంఎస్ అప్లికేషను, విల్లింగ్, ఎంసిఐ నిబంధనలు గురించి, నిర్వర్తించే విధివిధానాల గురించి తెలిపారు. అలాగే ఏజెన్సీలో నిఘా ఉంచుతూ ఎప్పటికప్పుడు రోప్ నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు.

అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో ఎఎస్‌పిలు ఒ.దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, డిఎస్‌పిలు ఎస్.ఆర్.హర్షిత, జివి కృష్ణారావు, జి.మురళీధర్, ట్రైనీ డిఎస్పీ ఎస్ఎండి అజీజ్, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్



పార్వతీపురంలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

నేడు భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

కలెక్టరేట్ వద్ద గురువారం జరిగే నిరసన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ కూడలి వద్ద భవన నిర్మాణ కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు పున:రుద్ధించాలని, సంక్షేమ పథకాలు అమలు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మెమో నెంబరు 1214 రద్దు చేయాలని, నాలుగేళ్లుగా పెండింగ్లో ఉన్న పరిహారాలను కార్మికులకు తక్షణమే చెల్లించాలని, సిమెంటు, ఐరన్, ఇసుక ధరలు తగ్గించి, నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారంకై గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద చేపడుతున్న నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, కార్మికులు గొర్లి సాంబమూర్తి, ముక్కు చందరావు, వెంకటరమణ, హెచ్ రాము, పార్వతి, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు..

పాలకొండ : భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలు బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేయాలని పాలకొండలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భవనిర్మాణ కార్మిక సంఘం పాలకొండ మండల కార్యదర్శి అర్థముడి లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులు నిరసన కార్యక్రమంలో భాగంగా పాలకొండ డివిజన్ కేంద్రంలో ఈనెల 29న తలపెట్టిన నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ ప్రతినిధులు ఎస్.నారాయణరావు, జి.హేమ సుందరరావు, పి.సంతు, ఎస్.రాంబాబు,

పాలిటెక్నికల్‌లో ప్రవేశాలకు సహకరించండి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక జిఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశాలకు ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపాళ్లు సహకరించాలని పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ డిఆర్ఎస్ గంగస్వామి తెలిపారు. బుధవారం స్థానిక ఐటిడిఎ సమావేశం మందిరంలో ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. పాలిటెక్నికల్ డిప్లమా విద్య ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. పాలిటెక్నికల్ డిప్లమా చేసిన వారికి ఉద్యోగం తప్పనిసరిగా వరిస్తుందన్నారు. ఈ ఏడాది టెన్త్ రాసిన విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. https;//aps-btet.ap.gov.in, https://polycetap.nic.in దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 27న పాలీసెట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ అంశాన్ని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ పాలిటెక్నికల్ కళాశాలలో రెసిడెన్షియల్ ఫ్యాకల్టీ మౌలిక వస్తులు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాల్ ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

5న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆదివాసీ గిరిజనులకు వ్యవసాయ పోడు పట్టాలను మంజూరు చేయాలని కోరుతూ మార్చి 5న జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని బెల్లపాకలో ఆదివాసీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సీదరపు అప్పారావు, మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని అటవీ పట్టాలు, ప్రభుత్వ డి-పట్టాలు ఇస్తామని చెప్పి డిసెంబర్ 2022, జనవరి 2023 లో సర్వేలు చేసిన వారికి ఇంతవరకు పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. పట్టాలు పంపిణీ చేయాలని గిరిజనులు అధికారులను అడుగుతున్నా నేటికీ పంపిణీ చేయడం లేదన్నారు. ఇందుకు నిరసనగా మార్చి 5న జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు గెమ్మెలా వెంకటేష్, సీదరపు సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పేదలకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని పేదలకు గురువారం ఇళ్ల పట్టాలు, డి పట్టాల పంపిణీ జరుగుతుందని ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్ చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో లబ్దిదారులకు డిప్యూటీ సిఎం రాజన్నదొర చేతులు మీదుగా పట్టాలు పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మహిళా మార్టు

ఆర్థిక ఆసరే ధ్యేయంగా మహిళా మార్ట్

నేడు డిప్యూటీ సిఎంచే ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరు

మహిళల ఆర్థిక స్వావలంబన ధ్యేయంగా పట్టణంలో జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటైంది. దీన్ని గురువారం డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రారంభించనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 1225 డ్వాక్రా సంఘాల్లో 12,622 మంది సభ్యులు వున్నారు. వీరంతా భాగస్వాములుగా మహిళా మార్ట్ రూపుదిద్దుకుంది. ఒక్కో మహిళా సంఘ సభ్యురాలు 150రూపాయలు ఎత్తుకుని మొత్తం రూ.18లక్షల 93వేల 300 పెట్టుబడితో మార్ట్‌ను రూపకల్పన చేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న పాత మీసేవ కేంద్రం భవనంలో మార్ట్ ఏర్పాటు చేశారు. డి-మార్ట్ తరహా సూపర్ మార్కెట్‌ను మహిళలంతా కలిసి రూపొందించారు. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మార్కెట్ ధర కన్నా తక్కువకు నిత్యావసర వస్తువులతో పాటు ఇతర వస్తువులన్నీ ఒకేచోట లభించేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంతవరకు ఇలాంటి మార్ట్‌లు 13 ప్రారంభమయ్యాయి. మెప్మా మార్గదర్శకత్వంలో రూపొందించిన ఈ సూపర్ మార్కెట్ పర్యవేక్షణకు 15మంది మహిళలతో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. మార్ట్‌లో 10మంది ఉద్యోగులు పని చేస్తారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న పట్టణాల్లో ఇదే మొదటి మహిళా మార్ట్. గత కొద్ది నెలలుగా మెప్మా సిఎంఎం ఎ.పుష్ప ఆధ్వర్యాన సిబ్బంది, మహిళా పర్యవేక్షణ కమిటీ సభ్యులు సంయుక్తంగా మహిళా మార్ట్ రూపకల్పనలో తలమునకలై ఉన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సూపర్ బజార్లు, సూపర్ మార్కెట్లు గ్రామాల్లోనూ ఏర్పాటవుతున్న తరుణంలో వెనుకబడిన గిరిజన నియోజకవర్గ కేంద్రంలో మహిళా మార్ట్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ ఉపేంద్రరెడ్డి

విద్యార్థుల్లో స్థాయిని పెంచాలి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థుల్లో సామర్థ్య స్థాయిని పెంచాలని రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.ఉపేంద్రరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 6,7,8 తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యాస అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చదవడం, రాయడం అనే వాటిలో సామర్థ్యాన్ని ఉపాధ్యాయులు పెంచాలన్నారు. అంతేకాక వారి తరగతుల విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి వారికి పెంపొందించాలన్నారు. విద్యార్థుల్లో సామర్థ్యం పెంచితే పై తరగతికి వెళ్లేటప్పుడు ఉత్తీర్ణత శాతం పెంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఇజి ప్రవీణ్ కుమార్, ఎపిఒ హరి, ఎంఇఒ సూర్య దేముడు హెచ్ఎం ఇ.ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రబీకి 9గంటలు విద్యుత్ సరఫరా చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

రబీ పంటలకు అంతరాయం లేకుండా 9 గంటలు విద్యుత్ సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మాదిరెడ్డి తిరుపతి నాయుడు, బోను గౌరు నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చేతికి అందిన పంట సాగునీరందక ఎండిపోవడం నాణ్యతలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకుండా కనీసం ఆరు గంటలు కూడా సక్రమంగా కరెంటు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ఈ సమయంలో యుద్ధ ప్రాతిపదికన కరెంటు సక్రమంగా అందించి సాగునీటి సమస్య లేకుండా రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. విలేకరుల సమావేశంలో రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు బోను కృష్ణ, సిఐటియు నాయకులు చింత పోలిరాజు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ రాజేంద్రప్రసాద్ వర్ధంతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బాబు రాజేంద్రప్రసాద్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నడుకూరు వడ్లపాడు నడుకూరు వడ్లపాడు నడుకూరు, బొడ్లపాడు, తెట్టంగి, తదితర గ్రామాల్లో జనసేన నాయకులు బీపీ నాయుడు, ఎం పుండరికం, జనసేన జానీ, జి.నరేంద్ర రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి -పాలకొండ

ప్రజారోగ్యమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని 17వ వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా పెద్దకాపువీధి పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కూడా నిధులు పెంచారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లారన్నారు. రోగులను డాక్టర్ తేజరత్నరాజ్ ఆధ్వర్యంలో వైద్యులు రామకష్ణ, రాజేశ్వరరావు, టి.కష్ణారావులు పరీక్షించారు. సుమారు 150 మందికి వైద్యసేవలు అందించారు. సూపర్‌వైజర్ రమణమ్మ, ఎఎన్ఎంలు వరలక్ష్మి, భారతి, దమయంతి, ఆశా వర్కర్లు చిన్నతల్లి, సునీత తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న దర్జీలు

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

పార్వతీపురం టైలర్స్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. టైలర్లంతా తమ షాపులు బంద్ చేసి టైలర్స్ సంఘం బిల్డింగ్ వద్ద పట్టణ అధ్యక్షులు ముడిలి వెంకటరమణ అధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నానాటికి కనుమరుగైపోతున్న దర్జీ వృత్తిని ప్రభుత్వం గుర్తించి టైలర్లకు మరిన్ని ప్రోత్సకాహాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లేపు చిన్నారావు, రాష్ట్రఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, పట్టణ సెక్రెటరీ శ్రీనివాసరావు, సభ్యులు కర్రావు ఈశ్వరరావు, ఉబిశెట్టి సూరిబాబు, అల్లు సాంబమూర్తి, వంగపండు లక్షణ, కర్రి సూర్యనారాయణ, అల్లక శంకర్రావు, నాగు, పెద్ద ఎత్తున టైలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డాక్టర్ చీకటి శంకరరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. హాస్టళ్లలోని సుమారు 200 విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, రక్తహీనత మొదలైన వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. విద్యార్థుల పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమతెరలు వాడాలని కోరారు. విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా వెంటనే సంబంధిత ఉపాధ్యాయులకు, వార్డెన్‌కు తెలియజేయాలని కోరారు. అనంతరం సిక్ రూమ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.తిరుపతి, వార్డెన్ ఎం.రాజేంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ ఆర్ సురేష్ కుమార్, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని ఎంఇఒలు చంద్రశేఖర్, జనార్దన్ నాయుడు కోరారు. బుధవారం వారు మండలంలో పలు పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులకు తగు సలహాలు, సూచనలు చేశారు. ఎంఇఒ-1 చంద్రశేఖర్ ఇరిడి పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సలహాలు చేశారు. అలాగే ఎంఇఒ-2 జనార్దన్ నాయుడు సీతంపేట, మండ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే నాడు-నేడు పనులను పరిశీలించి సూచనలు చేశారు.

కొండ చీపుర్ల తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని డోకిశీల పంచాయతీ డెప్పివలస గాంధీజీ విడివికెలో కొండ చీపురులు తయారీ కేంద్రాన్ని డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి పిడి వై.సత్యం నాయుడు బుధవారం పరిశీలించారు. శిక్షణా కార్యక్రమం నుద్దేశించి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివద్ధి చెందాలని, వ్యాపార వేత్తలుగా తయారు కావాలని, అందుకు ప్రభుత్వం అన్నివిధాలా సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పండించిన కొండ చీపురులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని, దీనిద్వారా ఇంటి వద్ద ఉండి ఖాళీ సమయాన్ని ఈ చీపురులు కట్టి ఆదాయం సంపాదించుకోవచ్చని తెలిపారు. ఇందుకు ముడి సరుకు, విడివికెల ద్వారా కొనుగోలు చేసి మార్కెట్ సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో డిపిఎం పి.ప్రవీణ్, ఎపిఎం పి.సురేష్, చేయూత ఎపిఎం సతీష్, మండల సమాఖ్య అధ్యక్షులు వై.జగదీశ్వరి, సిసి నాయక్, ఎఫ్‌పిఒ సీసీ అప్పలనాయుడు, విఒఎలు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలి

ఘనంగా పలుచోట్ల సైన్స్ దినోత్సవాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని, తద్వారా చదువుల్లో రాణించ గలుగుతారని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ ఎంవివిర్ కృష్ణాజీ అన్నారు. స్థానిక డివిఎం ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఫలాలు అందరికీ అందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒలు సామల సింహాచలం, ప్రసాదరావు, జెవివి జిల్లా అధ్యక్షులు ఎం. రత్న కుమార్, కార్యదర్శి డి.చంద్రమౌళి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రంజిత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.

బందలుప్పిలో....

మండలంలోని బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సైన్సు ప్రాజెక్టలను ప్రదర్శించారు. సైన్సు బొమ్మలను ముగ్గులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా జిల్లా సైన్సు కో-ఆర్డినేటర్ పి.రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ శాస్త్రీయి వైఖరితో ఉండాలని, భవిష్యత్తులో విద్యార్థులు శాస్త్రవేత్తలు కావాలని ఆకాక్షించారు. సమావేశంలో తొలిత సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం మూఢనమ్మకాలపై నాటిక ప్రదర్శన విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సిపురంలో...

మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకట నాయుడు, సైన్స్ ఉపాధ్యాయులు బాలకష్ణ, పురుషోత్తం, మురళి, రమేష్ సివి రామన్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలలోని సీనియర్ ఉపాధ్యాయుడు పోల ధనుంజయ నాయుడు విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటనాయుడు, ప్రసాదరావు, బివిఆర్‌కె నాయుడు, నిర్మల, అరుణ తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్వతీపురం కొత్తవలస శాంతి నికేతన్ పాఠశాల లో ప్రిన్సిపల్ డా.పిరవికుమార్ అధ్వర్యంలో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.



బలిజిపేటలో సైన్స్ నమూనాన వివరిస్తున్న విద్యార్థులు

బలిజిపేట : మండలంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన కార్యక్రమాలు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జయప్రసాద్ సమక్షంలో సివి రామన్ గొప్పతనం గురించి ఆయన భారతదేశానికి, విజ్ఞాన శాస్త్రానికి చేసిన సేవలను గురించి చేసిన ప్రదర్శనలు అలరించారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు రామన్ ఫలితం గురించి వివరించారు. విద్యార్థులు జి.లేపాక్షి ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ వర్కింగ్ సిస్టం, జి.కావ్య సమతల దర్పణాల్లో జరిగే ప్రతిబింబాలను, సింధు షా లైనింగ్ కండక్టర్స్, దీవెన శీతకోకచిలుక జీవిత చక్రం, హృదయ స్పందనలు, హైడ్రాలిక్ జాకు గురించి, చైతన్య అగ్నిపర్వతం మొదలగు ప్రదర్శనలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.అజయ్ ప్రసాద్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : జాతీయ సైన్స్ డే సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శనలు పాల్గొన్నారు. స్థానిక హెచ్ఎం హేమలత సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలతో అలంకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విజ్ఞాన ప్రదర్శనలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాలూరు: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్ లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ రాఘవాచార్యులు, హెచ్ఎం పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సర్ సివి రామన్ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సివి రామన్ గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని బాగువలస ఎస్సీ కాలనీ ఎంపిపి పాఠశాలలో సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లి, బాగువలస, తోణాం, కురుకుట్టి పురోహితులవలస, శివరాంపురం తదితర జిల్లా పరిషత్తు, ఆశ్రమ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నల్ల వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కురుపాం: మోడల్ నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కురుపాం : జాతీయ సైన్స్ డే దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టుల తయారు చేసి సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి పాఠశాల సిబ్బంది పరిశీలించి విద్యార్థులను అభినందించారు.

భామిని : జాతీయ సైన్స్ దినోత్సవం స్థానిక ఆదర్శ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ సైన్స్ మోడల్స్ ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రఘుపత్రుని శివకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించారు.

వీరఘట్టం : మండలంలో జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంబరవలస, తలవరం, తెట్టంగి, బిటివాడ తదితర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సివి రామన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.లక్ష్మి, డి.నాగమణి, ఉప్పాడ అప్పారావు, సిహెచ్ రత్నాకర్ రావు, సైన్స్ ఉపాధ్యాయులు వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

బిటి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక కురుపాం పంచాయతీ పరిధిలో గల సీతంపేటకు ప్రధాన తారు రోడ్డు నుండి గ్రామం వరకు ఒక కిలోమీటరు రోడ్డుకు రూ.70లక్షలు ఉపాధి హామీ నిధులు మంజూరై బిటి రహదారి నిర్మాణ పనులకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రహదారి, మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, కావున ప్రజలు గమనించి వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి జరిగి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అంది ఉంటేనే మరోసారి వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ దశాబ్దాల కల అయిన తమ గ్రామానికి బిటి రోడ్డు నిర్మాణం ఎన్నో ప్రభుత్వాలు మారాయని, కానీ కనీసం పట్టించుకోలేదని అన్నారు. వైసిపిలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి చొరవతో రహదారి నిర్మాణం జరుగుతున్నందుకు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిసి జి.సుజాత, జిల్లా కోప్షన్ సభ్యులు షేక్ నిసార్, ఐటిడిఎ ఇఇ జె.శాంతేశ్వరరావు, ఎంపిడిఒ ఎస్.అప్పారావు, ఎపిఒ పి.బావాజీ, మేజర్ పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్, వైస్ ఎంపిపిలు అన్నాజీరావు, రంగారావు, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు 2024లో భాగంగా బుధవారం ఎం ఆర్.నగరం (కృష్ణపట్నం) జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బ్యాంకింగ్, ఆర్థిక అక్షరాస్యతపై పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో 8, 9వ తరగతికి చెందిన 56 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి 5మంది విజేత బృందాలకు బహుమతులను లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్ఎన్ మూర్తి, అసోసియేట్ కె.మౌనిక, పాఠశాల హెడ్‌మాస్టర్ విజయ్ కుమార్, ఇతర ఉపాధ్యాయులు పంపిణీ చేశారు.

విగ్రహ నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెద్దపెంకిలో గల ఎస్సీ కాలనీలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు రూ.50 వేలు వితరణగా అందజేసినట్లు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు తెలిపారు. బుధవారం ఈ మొత్తాన్ని స్థానిక సర్పంచ్ నగిరి పాపారావు, ఎంపిటిసి శ్రీనివాసరావు సమక్షంలో సంజీవ నాయుడు ఆధ్వర్యంలో ఈ మొత్తం అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ నాయుడు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ విగ్రహ నిర్మాణానికి ఎమ్మెల్యే సహకరించడం గొప్ప విశేషమని, ఈ అవకాశాన్ని యువత వినియోగించుకొని నిర్మాణాన్ని సకాలంలో పూర్తిచేసేలా ప్రతిపాదనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు గోతులను పూడ్చుతున్న సిపిఎం నాయకులు

స్పందించని అధికారులు..గోతులు కప్పిన నాయకులు

ప్రజాశక్తి - కొమరాడ

రోడ్డుపై ఏర్పడిన గోతులను కప్పేందుకు అధికారులు చొరవచూపకపోవడంతో చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నట్లు సిపిఎం నాయకులు కొల్లి సాయమూర్తి తెలిపారు. ఈ మేరకు బుదవారం కొమరాడలో గల అంతరాష్ట్ర రహదారిపై గోతులు కప్పుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, టిడిపి నాయకులు బత్తిలి శ్రీను మాట్లాడుతూ రోడ్డు దుస్థితిపై ఈనెల 6న గుమడ సమీపంలో పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా వెళ్లే అంతరాష్ట్ర రహదారిపైలారీ దిగిపోవడంతో సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ అయిపోయిన పరిస్థితి తెలిసిందేనన్నారు. ఈ సందర్భంలో లారీ దిగిపోయిన రహదారి వద్ద నిరసన తెలియజేస్తూ ఈనెల 28లోగా ఈ గోతులు స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి గానీ, ఇటు రోడ్లు, భవనాలు శాఖ అధికారులు కానీ స్పందించి కప్పకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తాము ఈ గోతులను కప్పుతామన్న మాటకు కట్టుబడి బుధవారం శివాలయం నుండి జూనియర్ కాలేజ్ సెంటర్ వరకు వెళ్లే రహదారి మార్గంలో గల పెద్ద పెద్ద గోతులు కప్పామన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి అంతర్‌రాష్ట్ర రహదారులపై ఉన్న గొయ్యిలను పూడ్చి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రెడ్డి శివున్నాయుడు, గంగరేగివలస ఎంపిటిసి గంట వెంకటనాయుడు, రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యుడు నందిగామ ముని సాయి తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

తెలుగుదేశం పాలనలోనే రాష్ట్రంలో మహిళలకు ఆర్థిక స్వావలంబన, సాధికారత గుర్తింపు లభించిందని టిడిపి అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. మండలంలోని నర్సిపురంలో బుధవారం టైలర్స్ డే సందర్భంగా సత్యా శ్రీ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్న పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి బోనెల విజయచంద్రతో కలసి పాల్గొన్నారు. అనంతరం వారు మహిళను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే కాలంలో టిడిపి అధికారంలోకి తీసుకువచ్చి, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని రాష్ట్రంలో మహిళలందరూ కోరుకుంటున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యేక పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహాలక్ష్మి వంటి పథకాల ద్వారా మహిళలు వారి కాళ్లపై వారు నిలబడేందుకుగాను పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించే పథకాలను అమలు చేయనున్నారని తెలిపారు.

టిడిపిని విజయానికి కృషి

రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన అంతమొందించి టిడిపి ని అధికారంలోకి తీసుకురావడానికి టిడిపి అభిమానులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దబొండపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన పార్టీకి దూరమైన కార్యకర్తలను, నాయకులను, సానుభూతిపరులను ఇంటింటికీ వెళ్లి కలిసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పార్టీని విజయ పథంలో చేర్చేందుకు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి మాజీ అధ్యక్షులు దొగ్గ మోహన్‌రావు, వై.చినరామినాయుడు, చుక్క రావు, డి.అప్పయ్య, పోల సత్యనారాయణ, గొట్టాపు వెంకటనాయుడు బోను చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి, జయప్రకాష్, జనసేన మండల పార్టీ కన్వీనర్ ఆగూరు మని, పాండ్రంకి సత్యశ్రీ, వెంకటరమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న విజయచంద్ర

ఆరోగ్య సురక్ష కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో 2, 3, వార్డు లో జగనన్న ఆరోగ్య సురక్ష(జెఎఎస్ - 2) కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు ఆర్ బిఎస్‌కె డి.భాస్కరావు, డిఐఒ నారాయణ బుధవారం తనిఖీ చేశారు. వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి స్పెషలిస్ట్ వైద్యుల కౌంటర్ల వద్ద రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలను పరిశీలించి వారి అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగుల చెప్పే ఆరోగ్య సమస్యలను పూర్తి స్థాయిలో తెలుసుకొని తగు చికిత్స అందజేయాలని స్పష్టం చేశారు. ల్యాబ్ కౌంటర్ వద్ద పరీక్షలను పరిశీలించారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ అన్ని టెస్టులకు చేసి, వారి ఆరోగ్యం ఎలా ఉంది అనేదీ తెలియజేయాలన్నారు. అలాగే వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. డా. వైయస్సార్ కంటి వెలుగు తనిఖీలను పరిశీలించి కేటరాక్ట్ సర్జరీలకు గుర్తించిన వారికి సరైన నిర్దేశం చేయాలని అన్నారు. కళ్ల జోళ్లు అవసరమైన వారి వివరాలు సంబంధిత వైద్య సిబ్బంది పరిశీలనలో ఉండాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడు తున్న రోగాలకు ఆరోగ్య సూచనలు చేశారు. ఫార్మసీ వద్ద మందులను, అత్యవసర మందులను పరిశీలిం చారు. మందులు వినియోగించే విధానాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. జెఎఎస్-2లో అందజేసిన వైద్య సేవలను ఆన్లైన్ చేయాలన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలించి, ఆవశ్యకతను గర్భిణీ లకు వివరిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్పర్సన్ బోను గౌరిశ్వరి, వైద్యాధికారి లావణ్య, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ సగరిక, సూపర్వైజర్ వీరినాయుడు, జయగౌడ్, ఇందిర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను తనిఖీ చేస్తున్న వైద్యులు

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - కొమరాడ

కూనేరురామభద్రపురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు బుధవారం తనిఖీ చేశారు. ప్రతి రోజూ పిహెచ్‌సికి ఎటువంటి ఆరోగ్య సమస్యలతో వస్తున్నారు, జ్వరాలు ఏ మేరకు నమోదు అవుతున్నాయి వారికి నిర్వహిస్తున్న పరీక్షలు, అందజేస్తున్న చికిత్సా వివరాలపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. ల్యాబ్‌లో రక్త నమూనాలు పరిశీలించారు. మలేరియా, డెంగీ జ్వర నిర్ధారణ పరీక్షల రికార్డులు తనిఖీ చేశారు. వసతి గృహ విద్యార్థులు, మారుమూల గ్రామాల్లో జ్వర లక్షణాలున్న వారికి క్షేత్ర స్థాయి సిబ్బంది రక్త నమూనాలను సేకరించాలని డాక్టర్ జగన్ ఆదేశించారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న హెల్త్ వెల్నెస్ కేంద్రాలను పర్యవేక్షణ చేయాలని, ఆ పరిధిలో ఉండే గ్రామీణులకు అక్కడే వైద్య సేవలందేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం ఆయన పిహెచ్‌సిలో వ్యాక్సిన్ నిల్వలు, వాటి నిర్వహణ విధానం తనిఖీ చేసి వచ్చే నెల 3న జరగబోయే పల్స్ పోలియో ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొన్నారు. సిబ్బంది పిహెచ్‌సిల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్, ఎఎంఒ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సకాలంలో వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్క వేతనదారునికి పని కల్పించి, సకాలంలో వేతనాలు చెల్లించాలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ పి.సూర్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధిహామీ సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు నిర్దేశించిన వేతనం గిట్టుబాటు అయ్యేలా ఉపాధి హామీ అధికారులు ముందుగా కొలతలు ఇచ్చిన అనంతరం పనులు చేయించాలని అధికారులకు సూచించారు. వేతనదారులకు విధిగా వేతనం గిట్టుబాటు అయ్యేలా ఉపాధి హామీ చట్టం అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అలాగే ఉపాధి హామీ చట్టం పనుల్లో అధిక సంఖ్యలో వేతనదారులు పాల్గొనేలా చర్యలు చేపట్టాల్సి ఉందని ఈసందర్భంగా క్షేత్ర సహాయకులకు దిశ నిర్దేశం చేశారు. పనులు జరిగిన వెంటనే బిల్లులను అప్లోడ్ చేస్తే సకాలంలో వేతనాలు చెల్లింపులకు అవకాశం ఉంటుందని స్పష్టంచేశారు. సమావేశంలో ఎపిఒ గౌరీనాథ్, జెఇ దొడ్ల శ్రీనివాసరావు, సాంకేతిక సహాయకులు కొట్నాన నిర్మల, మర్రాపు భూలక్ష్మి, మరిశర్ల హరికష్ణ, ఎం ఉమామహేశ్వరి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని భామిని, సీతంపేట మండలాల్లో ప్రకృతి వ్యవసాయ స్టేట్ రిసోర్స్ పర్సన్ దేవుళ్ల గులిరాగి మోడల్స్, కిచెన్ గార్డెన్ మోడల్స్, ఏ గ్రేడ్ మోడల్స్‌ను పరిశీలించారు. భామిని మండలం పోలవరంలో బిటిక నారాయణ ఎటిఎం మోడల్ విజిట్ చేశారు. జక్కరగూడలో సవర అద్దాయి, సవర లింగయ్యతో పాటు మరో 13 మంది రైతుల గులిరాగి పంటను పరిశీలించారు. మండ కాలనీలో రైతు సవర భాస్కరరావు ఎటిఎం మోడల్ చూడడం పరిశీలించారు. అనంతరం చిన్న బగ్గలో రైతులతో సమావేశమై వాసన్ ఎన్జీవో ద్వారా రైతులకు సోలార్ ఇరిగేషన్ ద్వారా 100 ఎకరాలకు నీటి సదుపాయం కల్పించ నిమిత్తం వాసన్ ఎన్జీవో సమావేశం ఏర్పాటు చేసి రైతులతో చర్చించారు. ఈ ప్రకృతి వ్యవసాయ ఫీల్డ్ విజిట్‌కు వాసన ఎన్జీవో జిల్లా కన్వీనర్ కల్యాణపాత్రో, కోఆర్డినేటర్ రమణ ఐటిడిఎ ఎన్ఎఫ్ ఎ.ముసలయ్య, ఎంప్టీ బాలు, అంబోజి యూనిటీ ఇన్చార్జులు, ఐసిఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

టిడ్కో ఇళ్ల అప్పగింత ప్రక్రియ ప్రారంభించడం అభినందనీయమని, అయితే లబ్ధిదారులు రాకపోకలు సాగించేందుకు అడ్డాపుశీల బస్టాప్ సమీపం నుండి ప్రత్యామ్నాయ రహదారి సౌకర్యం కల్పించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. బుధవారం ఆయన టిడ్కో ఇళ్ల సముదాయాన్ని పరిశీలించారు. పట్టణం నుంచి టిడ్కో లబ్ధిదారులు రాకపోకలు సాగించేందుకు రూపొందించిన రహదారి చాలా దూరంగా ఉందని, దీనివల్ల తీవ్ర అసౌకర్యంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారికి ప్రత్యామ్నాయంగా అడ్డాపుశీల బస్‌స్టాప్ పక్క నుంచి చెరువు గట్టు మీదగా రహదారి సౌకర్యం కల్పిస్తే ప్రజల రాకపోకలు సాగించేందుకు ప్రయోజనకరంగా ఉంటుందని, ఆదిశగా ఎమ్మెల్యే, టిడ్కో చైర్మన్ ఆలోచించి అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కోరారు.

వీరఘట్టం ఎంపిడిఒగా సుబ్రమణ్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎంపిడిఒగా ఎంవిబి సుబ్రమణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వంగర మండల ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపిడిఒగా విధులు నిర్వహించిన ఎస్.సాల్మన్‌రాజు బదిలీపై వంగర మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

పోలింగ్ బూత్‌లో మారని వివరాలు

ప్రజాశక్తి - భామిని

సాధారణంగా ప్రతి పోలింగ్‌బూత్‌లో ఓటర్ సమస్యలు నివృత్తి చేయడానికి సంబంధిత బిఎల్ఒ పేరు, వివరాలు, కాంటాక్ట్ నెంబర్, పోలింగ్ స్టేషన్ నెంబర్‌ను పోలింగ్ బూత్ రాసి ఉంటాయి. కానీ బొమ్మిక 118 పోలింగ్ బూత్‌లో పాత బిఎల్ఒ పేర్లు, కాంటాక్ట్ నెంబర్లతో రాసిన వివరాలు కనిపిస్తున్నాయి. సదరు ఆ పోలింగ్ బూత్లో ఓటర్ సంబంధిత సమస్య ఉంటే ఎవరిని సంప్రదించాలి? అధికారులు చొరవ తీసుకుని ప్రస్తుత బిఎల్ఒ పూర్తి వివరాలు నమోదు చేయాలనీనిఓటర్లు కోరుతున్నారు.